# త్రిభుజాకార దృశ్యాలు

### గోరాశాస్త్రి

"నిటలాక్షుండిపుడె త్రినచ్చినను గానీ —" అన్నంత శౌర్యాన్ని నిష్కారణంగా "జయశ్రీ" పత్రిక నిర్వాహకులు నాలో కలిగించారు. మదీయంబగు రచనను అస్మదీయులైన పాఠకులకు క్రిందటి మాసం సంచికలో కానరాకపోవడానికి కారణం నేను "సకాలంలో పంపకపోవడం" అని అచ్చువేసేశారు. (కంపోజిటరు గారూ! ప్రూఫ్ రీడరుగారూ! ఉభయులూ కాస్త కరుణించండి. ఆ క్రిందటి నెలలో రచనలోని అక్షరాలను పప్పుకిచేసి వదలిపెట్టారు.)

అది సరే — "సకాలంలో పంపకపోవడం" అనేది రచయితకు ఎంత అవమానకరం! మహాకవులు మిసహా వచన రచయితలు అలాంటి నిర్లక్ష్యాన్ని కలనైనా తలపెట్టగలరా? ఒక చెంచాడు కీర్తిని — లేదా అపకీర్తిని — చూస్తూ చూస్తూ జారవిడుచుకుంటారా? భవదీయుడు పంపించాడు. సకాలంలోనే కాక "సుకాలం" చూసుకుని మరీ పంపించాడు. ఇది సత్యయుగం కాదు గనక "పోస్టు" చేసినట్లు సర్టిఫికేటుకూడా సర్కారువారి పోస్టాఫీసు ముద్రతో సహా తీసుకున్నాడు.

అంత, శ్రమపడితే వచ్చిన ఫలితం నీలాపనింద! నేనే గనక రాజస్థాన్ కథాకళిలో రసపుత్రవనితనైతే కైజారు తీసుకుని అమాంతం పొడుచుకుచచ్చేవాడిని, నేటిస్వతంత్రభారతంలో కాంగ్రెస్ దొరతనంలో జీవిక నెట్టుకొస్తున్నాను గనక అవమానాన్ని తుడిచివేయడానికి రెండేరెండు మార్గాలున్నాయి. ఒకటి: జయశ్రీ కార్యాలయం ముందు నిరాహార దీక్షపూనాలి. పోనీ అంత సాహసానికిదిగినా 'వలదు వలదు' అని వారించే వారెవరు? దీక్ష విరమణ తర్వాత ఏ మంత్రిగారువచ్చి తన కోమల హస్తాలతో నిమ్మరసాన్ని తాగిస్తారు? — యివన్నీ తీరని ఆశలు - పోతే రెండవ మార్గం: జయశ్రీ రచయితలలో "డిసిడెంటు" వర్గాన్ని లేవదీసి హంగామా చెయ్యాలి. సహకరించదలుచుకున్న రచయితలు నా చిరునామాకు ఉత్తరాలు వ్రాయండి. రేపు మీ పైకూడా యిలాంటి అభాండం పడవచ్చు. డిసిడెంటు వర్గానికి నాయకుడెవరని పేచీ వస్తుందంటారా? పోనీ "కాన్సెన్సస్" పద్ధతిపై ఎన్నుకుందాము.

పదార్థాన్ని పంపడం సత్యం. అది గమ్యాన్ని చేరకపోవడం అంతకన్నా సత్యం. బట్వాడా చేసే పోస్టల్ సిబ్బందికి ఎట్టివిధమైన బాధ్యతా చట్టరీత్యా లేకపోవడం మరీ మరీ సత్యం.

ఇందులో పరమ సత్యమేది? "ఏది సత్యం ఏదసత్యం ఓ ఇందిరా! ఓ కామరాజ్!"

త్రిభుజాకార దృశ్యం అంటే యిదే: లోతమర్మాన్ని తెలిసిన విజ్ఞులు గ్రహింతురుగాత!

* * *

ఉల్లాసం కలిగించే నాలుగువాక్యాలు వ్రాయకుండా యీ సొంత సోదె దేనికి! — అని పాఠకులు గుడ్లెర్రచేస్తారు (కంపోజిటరు

మహాశయా కరుణించండి. 'పాఠకులు' అని అక్షరాలు కూర్చి కసి తీర్చుకోకండి.) నిజమే, కాని ఏం చెయ్యను? ఎవరి స్వార్థం వారిది కదా! అంతేకాక—"అహం బ్రహ్మాస్మి" అనే భావనుండి తప్పించుకోవడం అసాధ్యంగా ఉంది. సదప సంస్కృతం మాటలకు అర్థాలేమిటంటారా — ఆకాశవాణివారు నిత్యం వినిపించే 'సూక్తిముక్తావళి' వింటే మీకే తేటతెల్లం అవుతుంది.

మధురమైన, రక్తివంతమైన రచన ఎలా బనాయించాలో ఆ కిటుకు నాకింకా తెలియలేదు. తగుమాత్రం "సెక్సు" రంగరిస్తే రచన గుబాళిస్తుందన్నంత వరకూ బోధపడింది. ఇవాళ రాదు ఏనాడో ప్రబంధాలు చదివినప్పుడే జ్ఞానోదయమైంది. అల్లసాని పెద్దన్న కంటె పెద్దన్నను కానుకదా! (ఒకానొక సాహిత్య రసికుడు ఆ పేరును కొంచెం "ప్రూఫ్ రీడింగ్" చేసి 'ఉల్లసాని పెద్దన్న' అనేది సరియైన పేరని నిర్ధారించాడు. కాదనడానికి నేనెంతవాడిని!) ఐతే ఆ రోజులు వేరు. పెదపెద్ద సంస్కృతం పదాలు వాడేస్తే అంతా గుబ్బుగా ఉండేది. ఇప్పుడలా కాదు. వ్యావహారిక భాషలో మామూలు పదాలు వాడాలి.

ఇక్కడే వస్తోంది చిక్కు. నెనరు, కూర్మి, మక్కువ, వలపు మోహం, మొదలైన పదాలు వాడడం యివాళ ఫ్యాషన్ కాదు. వాటిని చలామణీ నుండి తొలగించి వేశారు. అన్నింటికీ "ప్రేమ" అనే పదం ఒక్కటే చాలునని తీర్మానించారు. పొదుపు ఉద్యమం ఆర్థిక రంగంలోనే కాక సాహిత్య రంగంలోకి కూడా ప్రవేశించింది. పంచవర్ష ప్రణాళికలన్నీ ముగిసేటంతవరకూ భాషనూ, భావనాశక్తినీ పొదుపు చెయ్యాలి. ఐతే ప్రేమ అనే ఒక్కమాటతో ప్రేయసీ ప్రియులు వివిధ మనోభావాలను, చేష్టలను, నిట్టూర్పులను, తెలియ చెప్పడం చాలా కష్టం. సినిమా వాళ్లూ, ఆధునిక రచయితలూ సంతరించుకున్న ప్రతిభను అందరూ అలవరచుకోవాలంటే ఎలా సాధ్యమవుతుంది?

* * *

పై భావాలతో అనేకులు ఏకీభవించరు. నిజానికి ఎందుకు ఏకీభవించాలి? తమకు తోచిన అభిరుచులను అలవరచుకోవడానికి అందరికీ హక్కు ఉంది. ఒకరి సత్యం మరొకరికి భ్రాంతి. సులభంగా, సుఖంగా, భావనాశక్తికి బాధ కలిగించకుండా, "కాలక్షేపం బటాణీల" వంటి కమ్మని కథలు, నవలలు, ఆఖరికి "వచన గేయాలు" అందుతూంటే, వాటి హాయిని అనుభవించకుండా లేనిపోని కుశ్శంకలతో కుస్తీ పట్టడం దేనికి?

పత్రికా పుత్రికలు కూడా (వాటి కడుపు చల్లగ) చదువరులను అన్నివిధాలా సుఖపెట్టడానికే యత్నిస్తున్నాయి. సత్యాన్ని 'ఉత్తరాల' శీర్షిక ఢంకాబజాయించి రుజువు చేస్తుంది. "ఆర్యా! అధికాదేవిగారి కథ "వానలో కన్నీళ్ళు" చదివాను. చాలా గొప్పగా ఉంది. అందులో రాధ పాత్రను అద్వితీయంగా చిత్రించారు. రచయిత్రికి నా ధన్యవాదాలు" అని ఒక ఉత్సాహి వ్రాసిన లేఖ టకీమని అచ్చవుతుంది. అలాంటి ప్రతి ఉత్తరమూ అచ్చవుతుంది. రచయిత్రి, పత్రికాధిపతి, లేఖ వ్రాసిన పాఠకుడు- అందరూ ఆనందిస్తారు. అంతకన్నా కావలసిందేమున్నది?

"ఆనందో బ్రహ్మయటన్న ప్రాజదువు నంతర్బుద్ధి నూహింపుమా!" అని ప్రవరుడికి వరూథిని బోధించిన సూక్తి ఉజ్వల మణిదీపం వంటిది కాదా? సాహిత్యమంటేనే కల్పన. అందులో మళ్ళీ రూల్సూ, విలువలూ అంటూ గొణగడం శుద్ధ చాదస్తం.

నేటి సాంఘిక జీవితం ఒకరకంగా దుర్భరంగా వున్నా మరొకరకంగా చూస్తే హాయిగా ఉంది. మధురిమ వెల్లివిరుస్తున్నది. బియ్యం నుండి కిరసనాయిలు వరకూ జీవితావసర వస్తువులు దొరక్కపోతేనేంగాక, రూపాయి విలువ తగ్గిపోతేనేంగాక, అలాంటి క్షుద్రసమస్యలు కలిగించే నొప్పికి అంత సులభంగా లొంగిపోతామా? మనజాతి అంత నిర్జీవమైనదా?

ముమ్మాటికీకాదు. ఋషులు పుట్టిన యీ పురాణభూమి సుమారు వెయ్యేండ్లనుండీ యిలాగే ఉంది. అంచేత వీలైనంతలో సుఖపడడాన్ని నేర్చుకున్నాము. అందుకే రాజకీయాలలో కూడా రూల్సు పూర్తిగా ఎత్తేశాము. "ఎస్కేపిజమ్" పద్ధతులను సంతోషంగా చేపట్టాము.

బజారులు కళకళలాడుతున్నాయి. రాజకీయ నాయకులు పుష్టిగా ఉన్నారు. యయాతిమహారాజువలె యౌవనదశదాటిన వారు కూడా తరుణ వయస్కులవలె అగుపడడానికి కావలసిన దుస్తులూ, అలంకరణసామగ్రి మార్కెటు నిండా ఉన్నాయి స్త్రీలు సరేసరి. ఆధునికాలంకరణతో గంధర్వులను తలదన్నగల్గుతున్నారు. ఆగమాస్తుని ఇష్టలతలవలె మిరుమిట్లు గొల్పుతున్నారు.

"అమ్మాయీ! నీ కొరెక్క చల్లబడింది, నా జుట్టు తెల్లబడింది" అంటూ వెనకటికి శ్రీశ్రీ దూరదృష్టి లేకుండా ఒక గేయం వ్రాశాడు. ఇప్పుడాయన సినిమా కవి.

అలిసిపోయిన నరాలకు అలిసిపోయిన ప్రౌఢాంగనల నవనాడులకు వారి అంగాల నాడాలకు తరళ తారుణ్యాన్ని ప్రసాదిస్తున్న నాగరికతను సినిమాలద్వారా పత్రికల ముఖపత్రసుందరులద్వారా అందుకున్నమనే సత్యాన్ని ఆయనకూడా గ్రహించి ఉండాలి. అలనాటి మన ప్రబంధకారులు మాత్రం సామాన్యులా? "పూవమ్మువాని ఇల్లెక్కడ?" అని పుష్పాలను కొనడానికి వచ్చిన నాగరికుడు ప్రశ్నిస్తే "ఊరుమధ్య తిలకింపు" డని జాణయైన పుష్పలావిక జవాబిస్తుంది!

మన భారతీయ సంస్కృతి ఒక్కొక్కరికి ఒక్కొక్క రకంగా కనిపిస్తుంది. అదే దాని ప్రత్యేకత. త్రిభుజాకార సత్యాలను రంగు రంగులలో ప్రదర్శిస్తుంది. చూసి ఆనందించడం నేర్చుకోవాలేగాని, పొడసుత్తితో మరమ్మత్తు చేయాలని శ్రమపడే సంస్కరణవాది విఫలుడై అలిసిపోతాడు.

★

---

(6 వ పేజీ తరువాయి)

దానికి కారణం సంజీవరెడ్డి అని స్పష్టం ఔతోంది కదా! నిజంగా ఇందిరాగాంధికి అనుకూలమైతే, కేంద్ర మంత్రిగా ఉన్నందువల్ల ఆ అనుకూలతను తెలియ జేయడానికి శ్రీ సంజీవరెడ్డికి అనేక అవకాశాలు ఉండనే ఉన్నాయి. వీటినన్నిటినీ వదలిపెట్టి, హైదరాబాదులో పూర్వగాథను త్రవ్వి లాభం ఏమిటి? ఇవి ఎవరికి నచ్చజెప్పడానికి? ఇందువల్ల సంజీవరెడ్డిగారికి కలిసివచ్చేది యేమీలేదు సరికదా ఆయన అసమర్ధత బయటపడుతోంది.

ఏది ఏమైతేనేమి, ప్రదేశ్ ఎన్నికల సంఘంలో ఖాళీకి ఎన్నిక జరగడం తప్పనిసరి అనీ, పోటీకూడా తప్పదనీ స్పష్టమైపోయింది. ఎవరి బలాలను వారు సేకరించుకొంటున్నారు. ఈ ఖాళీకి ఏకగ్రీవ ఎన్నికంటూ కొన్ని పేర్లను సంజీవరెడ్డి ముఖ్యమంత్రికి సూచించారుకూడా. కాని ఈ విషయంలోకూడా ముఖ్యమంత్రి వద్ద ఆయన ఎత్తు పడలేదు. ప్రత్యర్ధి వర్గానికి నాయకత్వం వహిస్తున్నవారే రాజీ అభ్యర్థిని సూచించడంలో అర్థం ఏమిటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఉభయులకీ అంగీకారమైన వ్యక్తిని యిద్దరూ కలిసి ఎన్నుకొనడం గాని, ఉభయులకూ యిష్టమైన వారిచేత ఒకరి పేరును ప్రతిపాదింప జేయడం గాని కొంతవరకు రాజీకావచ్చు. కాని ఒక వర్గ నాయకుడే రాజీ అభ్యర్ధిని సూచించడం ఆశ్చర్యంగా ఉంటూంది. గోపాలరెడ్డి పేరును సంజీవరెడ్డి చెప్పడంకూడా ఒక ఎత్తుగానే భావించబడుతోంది. గోపాలరెడ్డి తమకు వ్యతిరేకి అని సంజీవరెడ్డికి తెలుసు. అయితే తాము ప్రతిపాదించడంవల్ల ఆయన ఎన్నికయ్యే పక్షంలో తమకు వ్యతిరేకంగా వ్యవహరించలేక పోవచ్చునన్నది ఒక విషయం. మరొకటి ఏమంటే అందుకు బ్రహ్మానందరెడ్డి అంగీకరించకపోతే ముఖ్యమంత్రిపై గోపాలరెడ్డికి కోపంరావచ్చు. ఏమైనా సంజీవరెడ్డిగారి యీ పాచిక పారలేదు. ముఖ్యమంత్రి ఎంతో జాగ్రత్తగానూ, చాకచక్యంగానూ వ్యవహరించాలి.

★